ప్రగతి పరుగులు.. సంక్షేమ కాంతులు

- మారిన పొదలకూరు రూపురేఖలు
- విస్తృతంగా సీసీరోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం
- గడప గడపకు మన ప్రభుత్వంలో సమస్యల గుర్తింపు
- అర్హులైన వారికి సంక్షేమ పథకాలు



సచివాలయ పరిధిలో నిర్మించిన సిమెంటురోడ్డు

పొదలకూరు : గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పడిన తర్వాత ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పరుగులు పెడుతోంది. అర్హులైన పేదలు నేరుగా సచివాలయాలకు వెళ్లి సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందుతున్నారు. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రమేయం ఉండకపోవడంతో పారదర్శకంగా సంక్షేమ పథకాలు పేదలకు అందుతున్నాయి. ప్రతి సచివాలయ పరిధిలో అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి పథకాల వివరాలను డిస్‌ప్లే ద్వారా తెలియజేస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రతి సచివాలయ పరిధిలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పర్యటించి సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించారు. అంతేకాక ప్రభుత్వం సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేసి గుర్తించిన సమస్యలకు పరిష్కారం చూపారు. దీంతో చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా పొదలకూరు బిట్–1 సచివాలయ పరిధిలో అభివృద్ధి





వీధుల్లో నిర్మించిన సైడ్‌డ్రెయిన్లు

పనులు జరిగాయి. ప్రధానంగా సిమెంటురోడ్లు, సైడ్‌డ్రెయిన్లకు రూ.కోట్లాది నిధులు వెచ్చించారు. ఎన్నో ఏళ్లుగా తీరని సమస్యలకు సైతం పరిష్కారం లభించింది.

డీబీటీ ద్వారా సంక్షేమ పథకాలు

పొదలకూరు బిట్–1 సచివాలయ పరిధిలో డీబీటీ(డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ద్వారా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అర్హులకు అందాయి. జగనన్న అమ్మఒడి, విద్యాదీవెన, వసతీదీవెన, వైఎస్సార్ రైతుభరోసా, ఉచిత పంటల బీమా, సున్నావడ్డీ పంట రుణాలు, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ మత్స్యకార భరోసా, డాక్టర్ వైఎస్సార్ పెన్షన్ కానుక, చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ(ఎస్‌హెచ్‌జీలు), కాపునేస్తం, ఈబీసీ నేస్తం, కల్యాణ మస్తు, షాదీతోఫా, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా, హౌసింగ్, వైఎస్సార్ బీమా, వాహనమిత్ర, వైఎస్సార్ నేతన్న నేస్తం, జగనన్న చేదోడు, తెల్లకార్డుదారులకు కోవిడ్ సమయంలో ప్రత్యేక సాయం, జగనన్న తోడు పథకాల ద్వారా 6,094 మంది లబ్ధిదారులకు రూ.18,55,60,575 నగదును నేరుగా బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం జమ చేసింది. నాన్ డీబీటీ ద్వారా ఇంటి నివేశన స్థలాలు, జగనన్న విద్యాకానుక, విద్యార్థులకు ట్యాబ్స్, జగనన్న తోడు, గోరుముద్ద, సంపూర్ణ పశుపోషణ, వైఎస్సార్ కంటి వెలుగు, ఇంటింటికీ రేషన్ సరుకులు ఇలా 3,418 మందికి రూ.15,33,06,605 అందజేశారు. డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా మొత్తం

పొదలకూరు బిట్–1 సచివాలయ పరిధిలో..
డీబీటీ ద్వారా లబ్ధిదారులకు జరిగిన మేలు రూ. 18,55,60,575
నాన్ డీబీటీ ద్వారా జరిగిన మేలు రూ. 15,33,06,605

రూ.33,88,67,180లను లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేసింది.

రూ.5 కోట్లతో మౌలిక వసతులు

మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సచివాలయ పరిధిలో సుమారు రూ.5 కోట్ల మేరకు మౌలిక వసతులు కల్పించారు. వీధుల్లో అంతర్గత సిమెంటురోడ్లు, సైడ్‌డ్రెయిన్ల నిర్మాణ పనులు పూర్తి చేయించారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఇళ్లపై 11 కేవీ విద్యుత్ తీగల సమస్యను ప్రజలు ఒక్కరూపాయి చెల్లించకుండా స్తంభాలు ఏర్పాటు చేయించి మార్పించారు. ఈ క్లస్టరులో దెబ్బతిన్న ఆర్అండ్‌బీ మెయిన్ రోడ్డును ఆధునికీకరించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.



పొదలకూరు బిట్-1 సచివాలయ భవనం

కాలనీలో సీసీరోడ్లు వేశారు



మా కేఆర్ఆర్ నగర్ కాలనీలో ఎన్నడూ లేనివిధంగా సిమెంటు రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం జరిగింది. గతంలో రోడ్లు లేక ఇబ్బందులు పడేవారం. మంత్రి కాకాణి ఇంటింటికీ వచ్చిన సందర్భంగా అడిగిన వెంటనే రోడ్లు మంజూరు చేశారు.

– చలంచర్ల పెంచలమ్మ, స్థానికులు, పొదలకూరు

నివేశన స్థలం ఇచ్చారు



నాకు సొంతింట్లో ఉండాలన్న కల నెరవేరబోతోంది. ఇంటి నివేశన స్థలం ఇవ్వడంతో పాటు, ప్రభుత్వమే ఇల్లు నిర్మించి అందజేస్తోంది. పేదలకు ఇంతకంటే ఏం కావాలి. తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే సీఎం కావాలని కోరుకుంటున్నాను.

– షేక్ కరిమున్నీసా, పొదలకూరు

అభివృద్ధి చేసి చూపారు



పొదలకూరు సచివాలయం బిట్–1 పరిధిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు బాగా అందాయి. మంత్రి కాకాణి అభివృద్ధి చేసి చూపి పేదలను ఆదుకున్నారు. పదేళ్ల అభివృద్ధి ఈ ప్రాంతంలో జరిగిందని చెప్పడానికి ఎలాంటి సందేహం లేదు. ఇక్కడ కాలనీలు ఉండడం వల్ల పేద ప్రజలు అధికంగా ఉన్నారు. వారికి ఎంతో మేలు జరిగింది.

– షేక్ షాకీరాబేగం, బిట్–1 ఎంపీటీసీ సభ్యురాలు

రూ.కోట్లాది పనులు చేపట్టాం



సచివాలయం బిట్–1 పరిధిలో సచివాలయ భవనం, రైతుభరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలతో పాటు సిమెంటురోడ్లు, సైడ్‌డ్రెయిన్లు తదితర పనులు రూ.కోట్లలో పూర్తి చేశాం.

– ప్రసాద్, పీఆర్ ఏఈ, పొదలకూరు

క్లుప్తంగా

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో మనుబోలమ్మ

మనుబోలు : మనుబోలు పెద్ద చెరువు గట్టున వెలసిన గ్రామ దేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకుడు సాయిశర్మ అమ్మవార్లకు అభిషేకాలు జరిపి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు గ్రామ దేవతలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

నేడు అనికేపల్లికి మంత్రి కాకాణి రాక

వెంకటాచలం: మండలంలోని అనికేపల్లి పంచాయతీలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం పర్యటిస్తారని వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ కోడూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డి ఆదివారం తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు గ్రామానికి చేరుకుని స్థానికంగా రూ.25 లక్షలతో నిర్మించిన చేపల మార్కెట్‌ను ప్రారంభిస్తారని, అనంతరం వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలియజేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కుంభాభిషేకం



నెల్లూరు రూరల్: పుష్కర కుంభాభిషేక మహోత్సవాలను పురస్కరించుకొని కనుపర్తిపాడులోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో అభిషేకాలు, పూజలను ఆదివారం నిర్వహించారు. ఆలయ ఆవరణలో నిర్మించిన 36 అడుగుల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి శిల్పానికి మహాకుంభాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో జరిపారు. వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మయూర వాహనంపై స్వామివారు రాత్రి విహరించారు. ఉభయకర్తలుగా పిడూరు శ్రీనివాసులురెడ్డి, కవితమ్మ దంపతులు వ్యవహరించారు. విగ్రహ దాత పొన్నవోలు అమలమ్మ, షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మండప నిర్మాణ దాతలు దువ్వూరు వెంకటేష్‌రెడ్డి, పద్మావతి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వెందోటి చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు.

పింఛనర్ల సర్వసభ్య సమావేశం రేపు

నెల్లూరు(బృందావనం): రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల అసోసియేషన్ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశాన్ని భక్తవత్సలనగర్‌లోని సంక్షేమ భవనంలో మంగళవారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్నామని సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్సెమ్ గౌస్, ఎస్వీవీఎస్ మూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హెచ్‌ఐవీపై అవగాహన



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని జనార్దన్ రెడ్డికాలనీలో హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమాన్ని ఏపీ శాక్స్, డాప్కూ ఆధ్వర్యంలో సింహపురి స్వగతి మహిళా అభ్యుదయ సంఘ కళాకారులు ఆదివారం నిర్వహించారు. జానపద నృత్యాల ద్వారా అవగాహన కల్పించారు. ఖాదర్‌వలీ, శివ తదితరులు పాల్గొన్నారు.

23న జాతీయ సదస్సు

నెల్లూరు(మినీబైపాస్): వ్యవసాయం, ఆహారోత్పత్తులు, ఆభరణాల రంగాలు తదితరాలపై జాతీయ సదస్సును చెన్నైలో ఈ నెల 23న నిర్వహించనున్నామని ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్, చెన్నై వైస్ చైర్మన్ కృష్ణమోహన్ పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. చెన్నైలోని గిండీలో గల రమాదా ప్లాజా హోటల్లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 వరకు సదస్సును నిర్వహించనున్నామని చెప్పారు. ఆసక్తి గల వారు ముందుగా నమోదు చేసుకోవాలని, వివరాలకు 98480 77227 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ముందు జాగ్రత్తగా మందుల పిచికారీ



మల్లూరులో వరిపైరుపై మందు పిచికారీ

ముత్తుకూరు : వరిపైరు కోతలకు వచ్చే ముందు రైతులు ముందు జాగ్రత్తగా మందులు పిచికారీ చేస్తున్నారని మండల వ్యవసాయాధికారిణి జ్యోత్స్నరాణి తెలిపారు. రబీ సీజన్‌లో మండలంలో 8,800 ఎకరాల్లో వరిసాగు జరుగుతోందన్నారు. ఇందులో 4,500 ఎకరాల్లో బీపీటీ రకం వరిసాగు అవుతోందన్నారు. అయితే, ప్రస్తుతం వెన్ను దశలో ఆరోగ్యకరమైన పైరుకు అగ్గితెగులు, దోమపోటు సోకకుండా రైతులు మందులు చల్లుతున్నారన్నారు. పండించిన ధాన్యానికి మంచి ధర రావడం కోసం ఈ చర్యలు తీసుకుంటారని తెలిపారు. మార్చి చివరి నుంచి ఏప్రిల్ నెలాఖరు వరకు వరి కోతలు ఉంటాయన్నారు.

ప్రతిష్టాత్మకంగా చాముండేశ్వరీదేవి మహా కుంభాభిషేకం


- దేవాంగ సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరావు



మాట్లాడుతున్న మల్లికార్జునరావు

కొడవలూరు(కోవూరు): కోవూరు పట్టణంలో వెలసిన శ్రీరామలింగ చాముండేశ్వరీదేవి దేవస్థానంలో అమ్మవారికి మహా కుంభాభిషేకాన్ని వచ్చే మే 25న అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు దేవాంగ సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి బోనగిరి మల్లికార్జునరావు తెలిపారు. పట్టణంలోని బుద్ధి పద్మావతి కల్యాణ మండపంలో సంఘ అధ్యక్షుడు పిచ్చుక మధుసూదన్‌రావు అధ్యక్షతన సంఘ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి మహా కుంభాభిషేక ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రతి ఏడాది సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి మహా కుంభాభిషేకం అత్యంత వేడుకగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ ఏడాది మరింత వైభవోపేతంగా నిర్వహించ తలపెట్టినందున దేవాంగులంతా సహకరించి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘ సభ్యులు బుద్ధి భీమేశ్వరరావు, సజ్జా వెంకట సురేష్, దోనిపర్తి జయరామయ్య, జి.వెంకట నాగేశ్వరరావు, జక్కల మహేష్, పన్నెం శ్రీనివాసులు, పి.రవి, జె.మధుసూదన్‌రావు, పి.సుదర్శన్‌బాబు, పి.సుధాకర్ పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ఆధునికీకరణ



విరువూరు విద్యుత్ సబ్‌స్టేషన్

- చుట్టుపక్కల గ్రామాల రైతులకు ఎంతో మేలు

పొదలకూరు : మండలంలోని విరువూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆధునికీకరించడంతో పాటు నూతన భవనానికి శంకుస్థాపన చేయడం వల్ల చుట్టుపక్కల గ్రామాల రైతులకు నాణ్యమైన విద్యుత్ లభించనుంది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈనెల 15వ తేదీన రూ.24 లక్షలతో నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన గావించారు. ప్రస్తుతం ఉన్న భవనం పూర్తిగా దెబ్బతినడంతో కొత్త భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఇక్కడ అసిస్టెంట్ ఇంజినీర్ కార్యాలయం, విద్యుత్ కంట్రోల్ రూమ్ నిర్మాణం చేపడుతామని పొదలకూరు ఏడీఈ సురేంద్రబాబు వెల్లడించారు. అంతేకాకుండా మరో రెండు రోజుల్లో రూ.11 లక్షలతో బ్రేక్ ఎక్స్‌టెన్షన్, బ్రేకర్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఫలితంగా విరువూరు, మహ్మదాపురం, సూరాయపాళెం, నల్లపాళెం, వెలికంటిపాళెం, నేదురుమల్లి, బత్తులపల్లి, యర్రబల్లి గ్రామాల రైతులకు ఎంతో ఉపయోగ పడుతుంది. అంతరాయం లేకుండా వ్యవసాయ విద్యుత్‌ను అందజేసేందుకు వీలు కలుగుతుంది. విరువూరు సబ్‌స్టేషన్ పరిధిలో గృహ వినియోగదారులు 4,400, వాణిజ్య వినియోగదారులు 200 మంది, పరిశ్రమలు 14, వాటర్ వర్కర్స్‌తో పాటు వీధి దీపాలు 138, వ్యవసాయ సర్వీసులు 2,500 కలిపి మొత్తం 7,252 సర్వీసులు ఉన్నాయి. సబ్‌స్టేషన్‌ను ఆధునికీకరించి బ్రేకర్ ఏర్పాటు చేస్తే ప్రమాదాల నివారణతో పాటు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు అవకాశం కలుగుతుంది.

నేడు నారాయణస్వామి ఆరాధనోత్సవం



పొదలకూరు : పొదలకూరుకు సమీపంలోని చిట్టేపల్లి తిప్ప వద్ద ఉన్న దేవగిరిక్షేత్రం వెంకయ్యస్వామి ప్రథమ శిష్యుడు నారాయణ స్వామి 16వ ఆరాధన మహోత్సవాలు సోమవారం వైభవంగా జరుగుతాయని నిర్వాహకులు వెల్లడించారు. ఉదయం నిత్యపూజలు, గణపతి పూజ, స్వస్తి వాచనం, నవగ్రహ ఆరాధన, శ్రీలక్ష్మీగణపతి హోమం, ఓం నారాయణ ఆదినారాయణ హోమం, పూర్ణాహుతి హోమం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు, రాత్రి 8 గంటలకు అన్నప్రసాదాలు, మధ్యాహ్నం భజనలు ఉంటాయన్నారు. రాత్రి 8 గంటలకు జాదుఘర్ టైగర్ మహ్మద్ మెజీషియన్ టీమ్ వారిచే మ్యాజిక్ షో, మాట్లాడే బొమ్మ హాస్యవల్లరి ఉంటుందన్నారు.

వెలవెలబోయిన చికెన్ దుకాణాలు



ఖాళీగా ఉన్న చికెన్ దుకాణం

మనుబోలు : బర్డ్‌ఫ్లూ భయంతో మండలంలో చికెన్ విక్రయాలు గణనీయంగా తగ్గాయి. మనుబోలు మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా చికెన్‌కు దూరంగా ఉండడంతో విక్రయాలు అంతంత మాత్రంగానే జరిగాయి. దీంతో చికెన్ దుకాణాలు జనం లేక వెలవెలబోయాయి. పొదలకూరు మండలంలో ఇప్పటికే బర్డ్‌ఫ్లూ కేసు నమోదు కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మండలంలోని వడ్లపూడి, వీరంపల్లి, మడమనూరు తదితర గ్రామాల్లో చికెన్ విక్రయించవద్దంటూ ఇప్పటికే దుకాణదారులకు నోటీసులు జారీ చేశారు. సాధారణంగా ఆదివారం ఒక్క మనుబోలులోనే టన్ను వరకూ చికెన్ విక్రయాలు జరుగుతుండగా ఈ ఆదివారం 300 కిలోలకు పడిపోయినట్లు సమాచారం. బర్డ్‌ఫ్లూ భయంతో నాన్‌వెజ్ ప్రియులు మటన్, చేపలు తినడానికి ఆసక్తి కనపరచడంతో వాటికి డిమాండ్ పెరిగింది.

బర్డ్‌ఫ్లూ నివారణకు ముమ్మర చర్యలు



గండవరంలో చికెన్ దుకాణాలు మూయించి బ్లీచింగ్ చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి

కొడవలూరు : మండలంలోని గండవరంలో పంచాయతీ అధికారులు ఆదివారం ముమ్మరంగా బర్డ్‌ఫ్లూ నివారణ చర్యలు చేపట్టారు. ఈ గ్రామంలో ఆదివారం ఐదు చికెన్ దుకాణాలు నిర్వహిస్తుంటారు. అధికారులు ముందస్తుగా దుకాణ నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేసి దుకాణాలు తెరవకుండా చర్యలు తీసుకోవడంతో పాటు చికెన్ దుకాణాల వద్ద, గ్రామంలోని వీధుల్లో చెత్తా చెదారాలు తొలగించి బ్లీచింగ్ చేయించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ఎం.బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చికెన్ దుకాణాలు మూయించామని, తదుపరి ఆదేశాల వరకు దుకాణాలు తెరిచేందుకు అనుమతించమని స్పష్టం చేశారు.

చేపల మార్కెట్లు కిటకిట



పొదలకూరు చేపల మార్కెట్లో గుమిగూడిన జనాలు

పొదలకూరు : బర్డ్‌ఫ్లూ కలకలం నేపథ్యంలో పొదలకూరులో చికెన్ దుకాణాలు మూసివేయడం వల్ల చేపల మార్కెట్ కిటకిటలాడాయి. మార్కెట్లో చేపలకు డిమాండ్ పెరిగి కిలో రూ.170లకు అమ్ముడుపోయాయి. బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకి పొదలకూరు పరిసర ప్రాంతాల్లో కోళ్లఫాంలో వేల సంఖ్యలో కోళ్లు మృతి చెందడం వల్ల అధికారులు చర్యలు చేపట్టి చికెన్ దుకాణాలను మూయించారు. కొద్దిరోజులు ప్రజలు చికెన్, కోడిగుడ్లను తినవద్దని హెచ్చరికలు జారీ చేశారు. దీంతో ఆదివారం ప్రత్యామ్నాంగా జనాలు చేపల మార్కెట్లకు వెళ్లి కొనుగోలు చేశారు.

చిన్నారి ఆపరేషన్‌కు రూ.50 వేల సాయం



చిన్నారి తల్లి పద్మకు ఆర్థిక సాయం చేస్తున్న సంఘ నేతలు

కొడవలూరు(కోవూరు): కోవూరు మండలంలోని గుమ్మళ్లదిబ్బకు చెందిన నిరుపేద కుటుంబం మోతుకూరి వెంకటసాయి, పద్మ దంపతుల ఐదు నెలల చిన్నారి గుండె శస్త్రచికిత్స నిమిత్తం ఏపీ వీవర్స్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు రూ.50 వేల సాయం అందించారు. ఈ మేరకు నగదును సంఘ నేతలు కేవీ శేషయ్య, బీ మల్లికార్జునరావు, ఎస్.వెంకటసురేష్ చేతుల మీదుగా కోవూరు మండల కేంద్రంలో ఆదివారం చిన్నారి తల్లి పద్మకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేతల సమస్యలను పరిష్కరించేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ ఎత్తివేయడంతో పాటు అన్ని నియోజకవర్గాల్లో చేనేత సామాజిక భవనాలు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు ఎన్.శ్రీనివాసులు, పి.మాలకొండయ్య, ఎం.నరేంద్ర, కె.రాజా తదితరులు పాల్గొన్నారు.

కంటేపల్లిలో ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

వెంకటాచలం : మండలంలోని కంటేపల్లి గ్రామంలో వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని శ్రీవత్స చెస్ట్ అండ్ చిల్డ్రన్స్ క్లినిక్ వారి సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఊపిరితిత్తులు, శ్వాసకోశ వైద్య నిపుణురాలు డాక్టర్ కల్యాణి, చిన్న పిల్లల వైద్యుడు డాక్టర్ చిరంజీవి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారిణి డాక్టర్ కె.సునీత, సోషల్ వర్క్స్ అధ్యాపకుడు బీవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.